క్లుప్తంగా

కొళాయి కనెక్షన్ తొలగించండి



తెనాలిఅర్బన్: కొళాయి కనెక్షన్‌ను తొలగించాలని చినరావూరు తోట వాసి కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. పొల్యూషన్ సమస్యను పరిష్కరించాలని, హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో పేరు తొలగించాలని పలువురు అర్జీలు ఇచ్చారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని మేనేజర్ విల్సన్ జయకర్ తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

మురుగు పారుదలకు చర్యలు తీసుకోండి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలిఅర్బన్: మురుగుపోయే దారి లేక ఇబ్బందులు పడుతున్నామని, వాటిని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పదోవ వార్డు ప్రజలు కోరారు. 10వ వార్డులో సోమవారం నిర్వహించిన ప్రత్యేక పారిశుద్ధ్య పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పరిశీలించారు. వార్డులో పర్యటిస్తు ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు, టీపీవో సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, విశ్రాంత డీఈ సుబ్బారావు, పలువురు సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

యాప్ పనితీరు పరిశీలన

కొల్లిపర: తాగు నీరు నాణ్యత, నీటి ద్వారా సంక్రమించే వ్యాధులను నివారించడానికి ఏర్పాటు చేసిన పీఆర్‌వన్ యాప్ పనితీరు, సమస్యలపై తాడేపల్లి పంచాయతీ రాజ్ కమిషనర్ కార్యాలయం నుంచి సోమవారం అసిస్టెంట్ డైరెక్టర్ సాయిలహరి, పీఎస్ టీం మెంబర్స్ నాగేంద్ర, రమికుమార్‌లు ఎంపీడీవో వి.వి జయలక్ష్మితో కలసి కొల్లిపర, మున్నంగి, వల్లభాపురం గ్రామంలో మంచి నీటి పరిశుభ్రత నమోదు, మంచినీటి వాటర్ ట్యాంక్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ భార్గవ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

కొల్లిపరలో దొంగలు హల్‌చల్

కొల్లిపర: వరుస చోరీలతో మండల కేంద్రంలోని గ్రామ ప్రజలు బెంబేలు చెందుతున్నారు. నిన్నటి వరకు దొంగలు తాళం వేసిన గృహలలో మాత్రమే దొంగతనాలు చేస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు నిఘాపెట్టి మరీ దొంగలను అరెస్టు చేసిన రెండు రోజుల్లోనే ప్రజల ఇంటో వేరొక గదిలో నిద్రిస్తున్న సమయంలో కొల్లిపర ప్రధాన రహదారిలో ఆదివారం దొంగతనాలు జరగడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గ్రామానికి చెందిన జొన్నల జాన్‌రెడ్డి తండ్రి సుబ్బారెడ్డి గృహంలో వేరొక గదిలో నిద్రిస్తుండగా దుండగులు వచ్చి వేరొక గదికి తాళంను పగలకొట్టి గదిలో ఉన్న లాప్‌టాప్, మొబైల్ ఫోన్ బ్యాగ్‌లో 75 వేల రూపాయలు విలువ కలిగిన వెండి వస్తువులు పోయినట్లు కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ పి.కోటేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన త్రీ టౌన్ సీఐ



తెనాలిరూరల్: త్రీ టౌన్ సీఐగా ఎస్.సాంబశివరావు సోమవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. 2004 బ్యాచ్‌కు చెందిన ఆయన ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో పని చేసిన ఆయన కొత్తపట్నం మెరైన్ స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. నూతన సీఐకు స్టేషన్ ఎస్ఐలు ప్రకాశరావు, కరిముల్లా, సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పోలీసింగ్, సేవలు అందిస్తామని తెలిపారు.

రావికి పతకాల పంట

తెనాలి: మాస్టర్స్ అక్వాటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళగిరిలో ఈనెల 11, 12 తేదీల్లో జరిగిన సెవెంత్ నేషనల్ మాస్టర్ అక్వాటిక్ చాంపియన్ షిప్‌లో తెనాలికి చెందిన రావి కిరణ్‌కుమార్ పలు పతకాలను గెలుచుకున్నారు. నాలుగు కేటగిరీల్లో ఒక స్వర్ణం, రెండు రజతం, ఒక వెండి పతకం చొప్పున నాలుగు పతకాలను సాధించారు. మంగళగిరిలోని ఎస్ఎం షంషేర్‌ఖాన్ మున్సిపల్ స్విమ్మింగ్ పూల్‌లో ఈ పోటీలను నిర్వహించారు. సంగం జాగర్లమూడి సంగమేశ్వర స్విమ్మర్స్ అసోసియేషన్ నాయకులు రావి కిరణ్ కుమార్‌కు అభినందనలు తెలిపారు.

నకిలీ మద్యానికి వ్యతిరేకంగా ర్యాలీ

- కదం తొక్కిన వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు
- బెల్టుషాపులు రద్దుచేయాలి
- నకిలీ మద్యం కేసు సీబీఐకి అప్పగించాలని డిమాండ్
- ఆరోగ్యాన్ని హరిస్తున్నారు
- నకిలీ మద్యంపై రణభేరిలో మాజీ ఎమ్మెల్యే శివకుమార్



శివకుమార్ నేతృత్వంలో తెనాలిలో పార్టీ శ్రేణులు నిర్వహించిన ర్యాలీ

తెనాలి: రాష్ట్రంలో కూటమి నేతల కనుసన్నల్లో నకిలీమద్యం తయారుచేస్తూ, రాష్ట్రవ్యాప్తంగా బెల్టుషాపుల్లో జరుగుతున్న అమ్మకాలకు నిరసనగా వైఎస్సార్ సీపీ పిలుపు ప్రకారం తెనాలిలో చేపట్టిన నియోజకవర్గ స్థాయి నిరసన ర్యాలీ విజయవంతమైంది. వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా పార్టీ నేతలు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో స్థానిక శివాజీచౌక్ నుంచి ఉదయం 11.30 గంటల ప్రాంతంలో ర్యాలీ ఆరంభమైంది. పార్టీ జెండాలు, ప్లకార్డులతో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. నకిలీ మద్యం దందా ను అరికట్టాలి, బెల్టుషాపులను రద్దుచేయాలి, నకిలీ మద్యం కేసును సీబీఐచే విచారణ చేయించాలి అనే డిమాండ్లతో కూడా ప్లకార్డులను ప్రదర్శిస్తూ కొనసాగిన ర్యాలీ ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయం వరకు చేరుకుంది. అక్కడే కొద్దిసేపు నినాదాలు చేశారు.

అనంతరం ఎక్సైజ్ పోలీసులకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అక్కడే మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, లీగల్‌సెల్ అధ్యక్షుడు మైలా విజయ్‌నాయుడు మీడియాతో మాట్లాడారు. ర్యాలీలో జడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతి, ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, పార్టీ పట్టణ, రూరల్, కొల్లిపర మండలాల అధ్యక్షులు దేసు శ్రీనివాసరావు, చెన్నుబోయిన శ్రీనివాసరావు, కల్లం వెంకటప్పారెడ్డి, అవుతు పోతిరెడ్డి, కౌన్సిలర్లు గుంటూరు కోటేశ్వరరావు, పేరం సంజీవరెడ్డి, కొర్ర యశోద, యాతాటి అనిల్, మల్లెబోయిన రాము, పెచ్చింగ్ సుభాని, ఎంపీటీసీలు మైలా భానుప్రసాద్, కాలిశెట్టి ఫణికుమార్, పచ్చవ రమేష్‌బాబు, షేక్ బాషా, సర్పంచ్ దేశబోయిన పున్నేశ్వరరావు, పార్టీ నేతలు గోల్డ్ రహిమా, తాడిబోయిన రమేష్, కఠారి హరీష్; భీమవరపు సంజీవరెడ్డి, బొమ్ము శ్రీనివాసరెడ్డి, వంగా సుధాకర్‌రెడ్డి, అవుతు నగేష్‌రెడ్డి, కాకి దేవసహాయం, వంపుగళ్ల కృష్ణ, కామేపల్లి లక్ష్మయ్య, బొంతు నరేంద్రరెడ్డి, చుక్కా ఆనంద్, అవుతు శేఖరరెడ్డి, నాలాది బుజ్జిబాబు, పిల్లి గంగాధర్, యంత్రపాటి స్టాలిన్, ప్రసాదం సురేష్‌బాబు, షేక్ ఖాజా, కందుల ఏసుబాబు, అడుసుమల్లి అజయ్, షేక్ అమీర్‌బాషా, పినపాటి రవికిరణ్, అక్కిదాసు కిరణ్‌కుమార్, దూరు రత్నబాబు, మంద్రు రాజు, గొరికపూడి బాలరాజు, టెక్స్‌బాల, తాతా సతీష్, బడుగు కోటయ్య, కుర్రా జస్వంత్, కొంగర రాగమంజరి, కావేటి నిర్మల, షేక్ జకీరా, షేక్ ఇస్రత్, తమ్మా సుజాతరెడ్డి, మన్నవ శాంతిశ్రీ, తురకా శాంతికుమారి, మార్పు ఇందిరా ప్రియదర్శిని, జయప్రద, మద్దాళి శేషాచలం, మన్నవ ప్రభాకర్, ఎస్. రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా నకిలీ మద్యం



ఎక్సైజ్ పోలీసులకు వినతిపత్రం ఇస్తున్న శివకుమార్, పార్టీ నేతలు

తెనాలి: 'అభివృద్ధి లేదు... సంక్షేమం లేదు... ఊరూరా నకిలీ మద్యం సరఫరా చేయిస్తున్నారు... ప్రజల ఆరోగ్యాన్ని హరిస్తున్నారు... మెరుగైన పరిపాలన అంటే ఇదేనా' అంటూ వైఎస్సార్ సీపీ తెనాలి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రశ్నించారు. నకిలీ మద్యంపై వైఎస్సార్ సీపీ రాష్ట్రవ్యాప్త రణభేరిలో భాగంగా సోమవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి స్థానిక శివాజీచౌక్ నుంచి ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అనంతరం అక్కడే నిరసన నినాదాలు చేసి, ఎక్సైజ్ పోలీసులకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చాక, ఆ పార్టీల నాయకులు అక్రమ మార్గాల్లో సంపాదన చూసుకుంటున్నారని ఆరోపించారు. అందులో భాగంగా బెల్టు షాపుల్లో వస్తున్న ఆదాయం సరిపోక, ఏకంగా నకిలీ మద్యాన్ని తయారుచేయిస్తూ రాష్ట్రం మొత్తం సరఫరా చేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రాతినిధ్యం వహిస్తున్న తెనాలి నియోజకవర్గంలో వైన్‌షాపులు ఉదయాన్నే ఏడింటికే తెరుస్తూ ఎనీటైమ్ మద్యం అమ్మకాలు చేస్తున్నారని ఆరోపించారు.

ప్రతి గ్రామంలోనూ బెల్టుషాపులు నడుస్తున్నాయని చెప్పారు. నాణ్యమైన మద్యంపేరుతో సరఫరా చేస్తున్న నకిలీ మద్యం తాగి పట్టపగలు నడిరోడ్డుపైనే స్పృహ లేకుండా పడిపోతున్నారంటూ ఆ వీడియోలను ప్రదర్శించారు. వైన్‌షాపుల వారు నెలకు రూ.70 వేల మామూళ్లు ఇస్తున్నామని చెబుతున్నారనీ ఆరోపించారు. మరోవైపు తెనాలిలో గుంతలు లేని రోడ్లు ఉన్నాయా? అని ప్రశ్నించారు. ప్రతివీధిలోనూ కుక్కలు జనం పిక్కలు పీకుతున్నాయని అన్నారు. తమ హయాంలో రూ.1800 కోట్ల సంక్షేమం అందించామని, 120 రోడ్లను నిర్మించామని గుర్తుచేశారు. ఇప్పుడు రోడ్లు వేయటానికి కూడా కంట్రాక్టర్లు ముందుకు రావటం లేదన్నారు. నకిలీ మద్యం కేసును సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. తెనాలి జడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతి, మహిళా విభాగం అధ్యక్షురాలు కొర్ర యశోద, మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, పట్టణ, తెనాలి రూరల్, కొల్లిపర మండలాల పార్టీ అధ్యక్షులు దేసు శ్రీనివాసరావు, చెన్నుబోయిన శ్రీనివాసరావు, కల్లం వెంకటప్పారెడ్డి, పార్టీ అనుబంధ కమిటీల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా రైతుకు సత్కారం



స్వాతిని శాలువాతో సత్కరిస్తున్న రాజకుమారి

అత్తోట(కొల్లిపర): మండల పరిధిలోని అత్తోట గ్రామంలో తొమ్మిది సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న యర్రు స్వాతి ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఢిల్లీ లో జరిగిన ప్రదర్శనలో స్వాతి ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రకృతి వ్యవసాయ పీ.జీ.ఎస్ సిర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా కృషి భవన్‌లో జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారిణి కె.రాజకుమారి, జిల్లా యాంకర్ గోపిచంద్, యర్రు స్వాతిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో మొదటిసారిగా ఈ గౌరవం అత్తోట గ్రామనికి చెందిన మహిళ రైతుకు లభించటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం గ్రామంలోని ప్రకృతి వ్యవసాయం చేస్తున్న యర్రు సత్యానారాయణ, యర్రు బావయ్య, యర్రు రత్తమ్మ, యర్రు రవీంద్ర అమెకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

నేడు తెనాలిలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ వేడుక

తెనాలిఅర్బన్: ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ వేడుకను మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే వేడుకలలో కమర్షియల్ ట్యాక్స్, మున్సిపల్, ఆర్అండ్‌బీ, హౌసింగ్ శాఖల అధికారులు పాల్గొంటారని చెప్పారు. జీఎస్టీ 2.0 అమలు వల్ల కలిగే లాభాలను తెలియజేయటం జరుగుతుందన్నారు. పట్టణంలోని బిల్డర్స్, డెవలపర్స్, కాంట్రాక్టర్‌లు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, వ్యాపారులు పాల్గొనాలని కోరారు.

ఖాళీ స్థలంతో భయం..భయం



ఖాళీ స్థలంలో పెరిగిన చెట్లు



చెట్ల మధ్య నిలిచిన మురుగునీరు

- అడవిని తలపిస్తున్న 'టెలికం' స్థలం
- నిరుపయోగంగా పదెకరాల స్థలం
- మార్కెట్‌లో రూ. కోట్ల విలువ
- పాములకు, క్రిమికీటకాలకు ఆవాసం
- నిలిచిన వర్షపు నీటితో దుర్వాసన

తెనాలి: భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్)కు చెందిన కోట్లాది రూపాయల విలువైన ఖాళీ స్థలం నిరుపయోగంగా ఉంది. దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైంది. ప్రస్తుతం చెట్లు విపరీతంగా పెరిగాయి. పాములు, విష పురుగులకు నిలయమైంది. చుట్టూ నివసిస్తున్న ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. వర్షపు నీటితో నిల్వతో భరించలేని దుర్వాసన వస్తోంది.

శిథిలావస్థకు చేరుకున్న క్వార్టర్స్

పట్టణ 11వ వార్డు పరిధిలోని గురవయ్య కాలనీలో బీఎస్ఎన్ఎల్‌కు దాదాపు పదెకరాల విశాలమైన స్థలం ఉంది. బీఎస్ఎన్ఎల్‌గా మారక ముందే డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికం (డాట్)గా ఉన్నప్పుడు ఈ స్థలంలోని కొంతభాగంలో పరికరాల కోసం స్టోర్స్‌ను, క్వార్టర్స్‌ను నిర్మించారు. సబ్ డివిజనల్ ఆఫీసర్ ఆఫ్ టెలికం (ఎస్‌డీఓటీ) అధికారి పర్యవేక్షణలో ఉండేది. తెనాలి, పొన్నూరు, రేపల్లె, మంగళగిరికి సంబంధించిన టెలికం స్తంభాలు, తీగెలు, ఇతర పరికరాలు అన్నీ ఇక్కడే ఉండేవి. విరిగిపోయిన స్తంభాలను ఇక్కడకు తరలించేవారు. స్టోర్ ఇన్‌చార్జి సహా 'డాట్'లో ఏఈ స్థాయి అధికారులు ఇక్కడే నివసించేవారు. కాలక్రమంలో నిర్వహణ లోపంతో భవనాలు దెబ్బతింటూ క్రమేణా శిథిలావస్థకు చేరుకున్నాయి.

కేంద్ర మంత్రి దృష్టికి సమస్యలు

అక్కడకి దగ్గర్లోని పూలే కాలనీ వద్ద నిర్మించిన మురుగునీటి శుద్ధి ప్లాంట్ ప్రారంభోత్సవానికి వచ్చిన కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి, స్థానిక ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్‌కు ఆ వార్డు కౌన్సిలరు కఠారి రత్నకుమారి స్థలం సమస్యను సభాముఖంగా విన్నవించారు. స్థానికుల పడుతున్న ఇబ్బందులను ఏకరువు పెట్టారు. దీనిని పరిశీలిస్తామని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హామీనిచ్చారు. ఆ తర్వాత కొద్దిసేపటికే సంబంధిత శాఖ, క్వార్టర్స్ మధ్యలో ఉన్న కొంతభాగంలోని చెట్లను పొక్లయిన్‌తో తొలగింపజేశారు. అంతటితో పని ఆగిపోయింది. అడవిలా పెరిగిన చెట్లను పూర్తిస్థాయిలో తొలగించి తమను ఇబ్బందుల నుంచి విముక్తులను చేయాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

పరిసరాల్లోని 200 కుటుంబాలకు అవస్థలు

క్వార్టర్స్ స్థలానికి చుట్టూ గల ప్రహరీ గోడ అంచునా కాలనీ విస్తరించింది. దాదాపు 200 గృహాలు ఏర్పాటయ్యాయి. జననివాసం పెరిగింది. ఇప్పుడు అదే ప్రదేశంలో పాముల సంచారం జనాన్ని భీతిగొలుపుతోంది. దీనికితోడు మురుగు దుర్వాసన. ఖాళీ స్థలాలను నిర్లక్ష్యంగా వదిలేస్తున్న పట్టణ ప్రజలకు నోటీసులు ఇస్తున్న మున్సిపాలిటీ దీనిపై ఏం చర్యలు తీసుకుందో తెలియదు. ప్రస్తుతం ఇక్కడ గజం స్థలం విలువ రూ.30 వేల పైమాటే. అంటే పదెకరాల విస్తీర్ణమంటే ఎంత విలువైనదో అర్థం చేసుకోవచ్చు.



అప్పటికప్పుడు క్వార్టర్స్ మధ్య చెట్ల తొలగింపు

బయటకు రావాలంటే భయంగా ఉంది



టెలికం క్వార్టర్స్‌ను ఆనుకుని ఉన్న గణేష్ కాలనీ మాది. క్వార్టర్స్ స్థలం ప్రహరీకి అనుకుని ఉంటాయి మా ఇళ్లు. వెనకు అంతా ఖాళీ స్థలమే. పిచ్చిచెట్లు పెరిగి, నిల్వ నీటితో దుర్వాసన వస్తోంది. పాములు సంచారం మామూలే. దీనితో చీకటిపడ్డాక బయటకు రావాలంటే భయమేస్తోంది.

– నున్నా సత్యరమేష్, గణేష్ కాలనీ

వీధి లైట్లు వెలగడం లేదు



మా ఇంటిముందు స్థలాన్నీ కూడా ఖాళీగా వదిలేశారు. చాలా ఇబ్బందిగా ఉంటోంది. దీనికితోడు మున్సిపల్ వీధిలైటు కూడా వెలగటం లేదు. ఎంతోకాలంగా సమస్యలతో బాధ పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

– అగర్వాల్ వసుంధర, గణేష్ కాలనీ

ప్రశాంతత కరువు



మా వార్డులో దశాబ్దాలుగా ఉన్న సమస్య ఇది. వందలాది కుటుంబాలకు ప్రశాంతత కరువైంది. బీఎస్ఎన్ఎల్‌కు చెందిన స్థలం అయినందున సంబంధిత శాఖాధికారులే చర్యలు తీసుకోవాలి. అందుకే కేంద్ర మంత్రి, రాష్ట్ర మంత్రి దృష్టికి తీసుకొచ్చా.

– కఠారి రత్నకుమారి, 11వ వార్డు కౌన్సిలరు

అన్నదాతలకు పెట్టుబడి సాయం ఏది?

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి



వినతిపత్రం ఇస్తున్న శివసాంబిరెడ్డి

తెనాలి: అన్నదాత సుఖీభవ పథకం క్రింద 20 వేల రూపాయలు పెట్టుబడి సాయం వెంటనే అందజేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి, సోమవారం మహిళా రైతు శివకుమార్‌తో కలిసి మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణకు వినతి పత్రం అందజేశారు. నూతన కౌలుచట్టం చేయాలనీ కోరారు. అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వం తెచ్చిన చట్టం దుర్మార్గమైందని, తాము అధికారంలోకి వచ్చాక మేలైన చట్టం తీసుకు వస్తామని కూటమి నేతలు చెప్పి 18 నెలలు గడిచాయన్నారు. భూ యజమానుల సంతకంతో సంబంధం లేకుండా గ్రామసభల ద్వారా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, రుణాలు ఇప్పించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీకూడా ఇచ్చినట్టు గుర్తుచేశారు. ఇంతకాలం గడచినా ఇంతవరకు అసెంబ్లీలో పెట్టకపోవటం అన్యాయమని శివసాంబిరెడ్డి అన్నారు. కులాలతో సంబంధం లేకుండా పెట్టుబడి సాయం ఒకే విడతలో ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విలువలతో కూడిన విద్యను అందించండి

డాక్టర్ కృపాచారి



అకాడమీని ప్రారంభిస్తున్న డాక్టర్ కృపాచారి

తెనాలిఅర్బన్: విలువతో కూడిన విద్యను అందించాలని దళిత ఓపెన్ యూనివర్సిటీ ఆఫ్ ఇండియా వైస్ ఛాన్సలర్ డాక్టర్ గుజ్జర్లమూడి కృపాచారి పేర్కొన్నారు. నందులపేటలోని మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మేరియన్ కేర్-ది ఎర్లీ ఎడ్యుకేషన్ అకాడమీని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో విలువలు అంతరించిపోవటం బాధకరమన్నారు. వాటిని పెంపొందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. స్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్ జేమ్స్ మోర్లీ మాట్లాడుతూ మేరియన్ కేర్ అనేది మాంటిస్సోరి గ్రూప్ ఆఫ్ ఇనిస్ట్యూషన్స్‌లో భాగంగా తెలిపారు. డాక్టర్ మరియా, డాక్టర్ గ్లైస్‌డోమాన్ విద్యా సిద్ధాంతాలను సమన్వయం చేస్తు, చిన్నారుల సమగ్ర అభివృద్ధికి ఇది దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో విద్యాంసంస్థల కరస్పాండెంట్ సెబాస్టిన్, ఆర్‌సీఎం చర్చి ఫాదర్ రెవరెండ్ స్లీవా, పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



తెనాలిలో కురుస్తున్న వర్షం

అల్పపీడనం కదా!

అల్పపీడనం ప్రభావం కారణంగా తెనాలి పట్టణంలో సోమవారం ఉదయం చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. ఉదయం వేళ కావటంతో ఉద్యోగులు, విద్యార్థులు, వివిధ పనుల నిమిత్తం వెళ్లే వారు ఇబ్బందులు పడ్డారు.

–తెనాలిఅర్బన్

భవిష్యత్ పరిపాలనలో వైఎస్సార్ సీపీ కమిటీలే కీలకం

మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: భవిష్యత్‌లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వార్డు/గ్రామ/మండల కమిటీలే పరిపాలనలో కీలకమని ఆ పార్టీ తెనాలి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. జాగ్రత్తగా ఆలోచించి సమర్థులు, ప్రజలకు అందుబాటులో వుండే వారిని కమిటీల్లో ఎంపిక చేసుకోవాలని సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం తెనాలి పట్టణం, రూరల్ మండలం, కొల్లిపర మండలాలకు వేర్వేరుగా జరిగిన అనుబంధ విభాగాల అధ్యక్షులు, ఇన్‌ఛార్జిల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అయిదేళ్లపాలనలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు సరైన గుర్తింపు లేదనే భావన అందరిలోనూ ఉందని గుర్తుచేశారు. అధికారాన్ని ఆస్వాదించలేదనే భావన ఉందన్నారు. దేశంలో మరెక్కడా లేని విధంగా సంక్షేమాన్ని అందించినా, పరిపాలన బాగున్నా, పార్టీ వర్గాలు నిరుత్సాహంతోనే ఉన్నట్టు చెప్పారు. ఈ పరిస్థితి ఇకపై ఉండదన్నారు. ఈ పరిణామాలను అర్థం చేసుకున్న పార్టీ అధినేత, మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈసారి పార్టీ నిర్మాణ దశలోనే భవిష్యత్‌కు సంబంధించిన సిస్టంను అమల్లోకి తెచ్చారని తెలిపారు. గ్రామ, వార్డు, మండల కమిటీలు, అనుబంధ కమిటీలను పటిష్టంగా నియమించటం అందులో ఒకటన్నారు. అధికారంలోకి వచ్చాక ఆయా కమిటీలకే పరిపాలనలో నిర్ణయాధికారం ఉంటుందన్నారు. అంటే క్షేత్ర స్థాయి నుంచే రాబోయే పరిపాలన జరుగుతుందని శివకుమార్ చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని చక్కని కమిటీలను నియమించాలనీ సూచించారు. గ్రామాలు / వార్డుల వారీగా నిర్ణయించిన షెడ్యూలు ప్రకారం పూర్తిచేయాలని, ఆ తర్వాత మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేయాలని వివరించారు. జడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతి, కల్లం వెంకటప్పారెడ్డి, చెన్నుబోయిన శ్రీనివాసరావు, అవుతు పోతిరెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

బాణాసంచా లైసెన్సులకు దరఖాస్తుల ఆహ్వానం

తెనాలి: దీపావళి పర్వదినం సందర్భంగా తెనాలి డివిజన్ పరిధిలో బాణాసంచాను విక్రయించడానికి ఆసక్తిగల వ్యక్తులు / వ్యాపారులు తాత్కాలిక లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి సబ్ కలెక్టర్, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ గుంటూరు లక్ష్మీకుమారి సూచించారు. అధికారులతో కలిసి సోమవారం సాయంత్రం పట్టణంలోని నందులపేట, సుల్తానాబాద్‌లో గల బాణసంచా లైసెన్సుదార్ల దుకాణాలను సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ, బాణాసంచా అమ్మకానికి సంబంధించి సురక్షిత చర్యలు, అగ్నిమాపక చర్యలతోపాటు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. తాత్కాలిక లైసెన్సులు కేవలం దీపావళి పండుగకు మాత్రమే చెల్లుబాటు అవుతాయని తెలిపారు. అనుమతి లేకుండా బాణాసంచా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల, మంగళగిరి, తాడేపల్లి, చేబ్రోలు, పొన్నూరు, కాకుమాను మండలాల పరిధిలో ఆసక్తి గల వ్యక్తులు/వ్యాపారులు తమ పూర్తి వివరాలతో దరఖాస్తులను సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో ఈనెల 15వ తేదీలోగా సమర్పించాలని కోరారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.